



# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190





ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :132 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ శనివారం- 05 - సెప్టెంబర్ - 2026

## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం



కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన

మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్

ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం

ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. మిగతా..2లో

## కొండా సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందన



కొండా సురేఖ తొలగింపు నిర్ణయం బాధాకరమన్న టీపీసీసీ చీఫ్

అయితే పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని స్పష్టీకరణ

హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరిక

పార్టీలోనే కొనసాగితే సురేఖకు అవకాశాలు ఉంటాయని సూచన

సీఎం రేవంత్ రెడ్డి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయరని స్పష్టీకరణ

హైదరాబాద్ : తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మిగతా..2లో

సెప్టెంబర్ 6న బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం

## నేతలకు కేసీఆర్ కీలక ఆదేశాలు!



2

• సెప్టెంబర్ 07వ తేదీ నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి

• ప్రజా సమస్యలపై సర్కార్‌ను ఎలా నిలదీయాలి అనే అంశాలపై గులాబీ బాస్ ప్రజాప్రతినిధులకు రోడ్‌మ్యాప్ ఇవ్వనున్నారు.

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ సమావేశాల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేసేందుకు బీఆర్ఎస్ శాసనసభా పక్ష సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 07వ తేదీ నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అసెంబ్లీ ప్రారంభానికి ఒక రోజు ముందుగా, అంటే సెప్టెంబర్ 06న ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో ఈ కీలక భేటీ జరగనుంది.

## కొడంగల్ నియోజకవర్గంలో డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను

# పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

• మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన

• వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు అందుబాటులోకి రావాలని ఆదేశం

• భూములిచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్న సీఎం



హైదరాబాద్: తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి మిగతా..2లో

## రైతుల జీవితాలతో రేవంత్ రెడ్డి ఆడుకుంటున్నారు..



• రైతుల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆడుకుంటున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

• రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు.

కొమురం భీం జిల్లా, సెప్టెంబర్ 4, : రైతుల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆడుకుంటున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి మిగతా..2లో

## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం..

# జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

❖ దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు

❖ విమాన సేవలకు తీవ్ర అంతరాయం, 400కు పైగా ఫ్లైట్స్ ఆలస్యం

❖ 9 విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్‌కు దారి మళ్లింపు

❖ ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేసిన ఇండిగో, ఎయిర్ ఇండియా

❖ ఢిల్లీకి రెడ్ అలర్ట్ ప్రకటించిన భారత వాతావరణ శాఖ



ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో మిగతా..2లో

## సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి విదేశీ పర్యటన



2

• ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్ లో పర్యటించనున్న విజయ్

• భార్య, కుమార్తెలను విజయ్ కలుస్తాడంటూ ప్రచారం

ఢిల్లీ : తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తన తొలి అధికారిక విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన ఈ నెల 10 నుంచి 16 వరకు బ్రిటన్ లో పర్యటించనున్నారు.

## 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో ఉద్ధృతి

# భారత్‌కు పొంచి ఉన్న ముప్పు

❖ బలపడుతున్న ఎల్ నినో- భారత్‌పై పంజా

❖ వర్షాలు తగ్గి భారీగా ఎండ తీవ్రత పెరిగే అవకాశం!




ఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా చూస్తున్న వాతావరణ మార్పులు రానున్న రోజుల్లో మరింత దారుణంగా మారబోతున్నాయా? మన దేశంలో వర్షాలు తగ్గి, ఎండ తీవ్రత ఊహించని స్థాయిలో పెరగబోతోందా? అవుననే అంటోంది ప్రపంచ వాతావరణ సంస్థ. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన 'ఎల్ నినో' పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చి, ఫిబ్రవరి 2027 వరకు కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరించింది. దీనివల్ల వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై గణనీయమైన ప్రభావం పడవచ్చునని పేర్కొంది. అలాగే వరదలు, కరవు, తీవ్రమైన వేడి వంటి ప్రమాదాలు కూడా తలెత్తవచ్చని ఆ సంస్థ వెల్లడించింది. ఈ దీర్ఘకాలిక ఎల్ నినో ప్రభావం భారత్ వాతావరణంపై, ముఖ్యంగా వర్షపాతం, వ్యవసాయ రంగాన్ని ఎలా దెబ్బతీయబోతోందో ఇప్పుడు ఈ కథనంలో చూద్దాం తెలుసుకుందాం. గురువారం డబ్ల్యూఎంఓ సెక్రటరీ మిగతా..2లో

## ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు కీలక భేటీ



2

• పీఆర్సీ, కరవు భత్యం తదితర అంశాలపై చర్చించనున్న సీఎం

• నిన్న చంద్రబాబును కలిసిన ఏపీ జేఏసీ నేతలు

• ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ముఖ్యమంత్రి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది.

# కాలుష్యం కలుపుతున్నారు పన్నులు ఎగ్గొడుతున్నారు'

## ఆంధ్రా పేపర్ మిల్స్ పై పవన్ తీవ్ర ఆగ్రహం

• రాజమండ్రి వద్ద గోదావరి కాలుష్యంలో సగం ఆంధ్రా పేపర్ మిల్స్‌దే

• ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యం వైఖరిపై పవన్ కళ్యాణ్ ఆగ్రహం

• ఆంధ్రా పేపర్ మిల్స్ పన్నులు చెల్లించి పుష్కరకాలం దాటింది

• ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యం వైఖరిపై పవన్ కళ్యాణ్ ఆగ్రహం



అమరావతి : రాజమహేంద్రవరం ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు ఎగవేయటంతో పాటు గోదావరిలో యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నారని మండిపడ్డారు. 2016 తర్వాత కాతేరు మిగతా..2లో

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం

# తప్పుడు ప్రచారం



• ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్

• ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ

• కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం

• ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ

• విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్

అమరావతి: ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు కీలక భేటీ

ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేపు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు. నిన్న సచివాలయంలో ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## కొడంగల్ నియోజకవర్గంలో డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం

ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### సెప్టెంబర్ 6న బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం

## నేతలకు కేసీఆర్ కీలక ఆదేశాలు!

మధ్యాహ్నం 1 గంటకు ప్రజాప్రతినిధులకు లంచ్ ఏర్పాటు చేయగా, అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కేసీఆర్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుంది. ఈ భేటీకి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వంపై సభలో ఎలాంటి అంశాలపై ఒత్తిడి తీసుకురావాలి, ప్రజా సమస్యలపై సర్కార్‌ను ఎలా నిలదీయాలి అనే అంశాలపై గులాబీ బాస్ ప్రజాప్రతినిధులకు రోడ్‌మ్యాప్ ఇవ్వనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉభయ సభల్లో సమర్థవంతంగా ఇరుకున పెట్టేలా బలమైన కార్యాచరణను ఈ సమావేశంలో ఖరారు చేయనున్నారు.

## సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి విదేశీ పర్యటన

లండన్‌లో జరిగే పలు కీలక పారిశ్రామికవేత్తల సమావేశాల్లో పాల్గొని ఉన్నత స్థాయి చర్చలు జరపనున్నారు. అయితే, ఈ పర్యటన కేవలం అధికారిక కార్యకలాపాలకే కాకుండా ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించింది అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల విజయ్ భార్య సంగీత విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో వారిద్దరి మధ్య మనస్పర్థలు తొలగిపోయాయనే వార్తలు జోరుగా వినిపిస్తున్న నేపథ్యంలో, లండన్‌లో నివసిస్తున్న భార్య సంగీత, కుమార్తె దివ్యలను ఆయన ఈ పర్యటనలో కలుసుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఇదే సమయంలో నటి త్రిష కూడా ఓ షూటింగ్ నిమిత్తం యూరప్‌లోనే ఉండటంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి, రాష్ట్రంలో పెట్టుబడులు సాధించే ముఖ్యమైన లక్ష్యంతో పాటు వ్యక్తిగత జీవితపు ప్రాధాన్యతల నడుమ సీఎం విజయ్ తొలి విదేశీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం.. జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో ఉద్ధృతి

## భారత్‌కు పొంచి ఉన్న ముప్పు

జనరల్ సెలెస్టే సౌలో ఎల్ నినో పై కీలక విషయాలు వెల్లడించారు. "స్పానిష్ భాషలో 'ఎల్ నినో' అంటే చిన్నపిల్లవాడు అని అర్థం. కానీ ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు, మానవ సమాజాలకు మిగిల్చేది మాత్రం కోలుకోలేని దెబ్బ. పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే ఈ ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కరువులు, వరదలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు కారణమవుతోంది. ఎల్ నినో తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత పెరుగుతాయని మేము అంచనా వేస్తున్నాం" అని ఆమె హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సెప్టెంబర్ నెల అంచనాలో, ఎల్ నినో పరిస్థితులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని పేర్కొన్న కొద్ది రోజులకే డబ్ల్యూఎంఓ ఈ అంచనాలను వెలువరించడం గమనార్హం. సాధారణంగా ఎల్ నినో ఏర్పడిన సంవత్సరాల్లో భారతదేశంలో రుతుపవనాలు బలహీనపడటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెల గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా సాధారణం కంటే 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. అంతేకాకుండా 1901 నుంచి ఇప్పటివరకు నమోదు కానంత అత్యధిక ఉష్ణోగ్రతలు ఈ ఆగస్టులోనే నమోదయ్యాయి. ఇక సెప్టెంబర్ నెలలో కూడా సుదీర్ఘకాల సగటు వర్షపాతంలో 91 శాతం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండి అంచనా వేసింది. ఇది రైతాంగానికి, ముఖ్యంగా వర్షాధార పంటలకు తీవ్ర ఆందోళన కలిగించే అంశం.

### శీతాకాలం తగ్గుతోంది!

కేవలం వర్షాకాలం మాత్రమే కాదు చలికాలంపై కూడా ఎల్ నినో నీడలు అలుముకున్నాయి. ఇప్పటికే దేశంలో శీతాకాలపు రోజులు తగ్గిపోతున్నాయని దిల్లీకి చెందిన 'క్లైమేట్ ట్రెండ్స్' సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. ఉత్తర భారతదేశంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. ఫిబ్రవరి నెలలో ప్రతి దశాబ్దానికి ఉష్ణోగ్రత 0.69 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగుతోందని అంచనా. మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా వరుసగా 0.58 డిగ్రీలు, 0.66 డిగ్రీల సెల్సియస్ మేర వేడి పెరుగుతోంది.

### ఆహార భద్రతకు ముప్పు

ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల మన ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపుతోంది. శీతాకాలంలో పండించే ముఖ్యమైన రబీ పంట అయిన గోధుమలపై ఇది ప్రభావం చూపి పంట దిగుబడి భారీగా తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలం ముగిసే సమయంలో వచ్చే ఈ వేడిగాలులు రైతులకు కోలుకోలేని దెబ్బగా మారుతున్నాయి. ఎల్ నినో సుదీర్ఘకాలం కొనసాగే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నందున, ఇటు ప్రభుత్వం అటు రైతాంగం ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటి నిల్వల నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఉష్ణోగ్రత తట్టుకునే విత్తనాల వినియోగంపై దృష్టి సారించాల్సి ఉంది.

## కొండా సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందన

మొదటి పేజి తరువాయి

ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ



సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## కాలుష్యం కలుపుతున్నారు-పన్నులు ఎగ్గొడుతున్నారు'

మొదటి పేజి తరువాయి

గ్రామ పంచాయతీకిగానీ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు గానీ ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించలేదని పవన్ తెలిపారు. రూ. 21.34 కోట్ల వరకు స్థానిక సంస్థలకు పన్నులు బకాయి ఉందని, నోటీసులు ఇచ్చిన ప్రతిసారీ కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేస్తున్నారని అసహనం వెలిబుచ్చారు. రాజమహేంద్రవరం నగరం మొత్తం దాదాపు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే, ఆ మిల్లు నుంచి 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వస్తున్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆ వ్యర్థాల్లో పరిమితికి మించి కాలుష్య కారకాలు ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. లీటర్ నీటికి 36 మిల్లీగ్రాముల బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) ఉందని, నిర్ణీత ప్రమాణాల కంటే 20 శాతం అధికమని తెలిపారు. ఫాస్ఫేట్ 5.3 మిల్లీగ్రాములు, సల్ఫైడ్స్ 3.4 మిల్లీగ్రాములు ఉన్నట్లు చెప్పారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాలతో పోలిస్తే ఇది 70 శాతం అధికమని వివరించారు. కంపెనీని సీజ్ చేయొచ్చు కానీ : కాలుష్యం కారణంగా నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గి జలచరాల మనుగడకు ఇబ్బంది అవుతోందని, గోదావరి నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బ తింటోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. తాను క్షేత్రస్థాయిలో పర్యటించి భూగర్భ జలాలు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పినా పాటించలేదని మండిపడ్డారు. మీ ఉల్లంఘనలకు పరిశ్రమలో కార్యకలాపాలు నిలిపివేసి కంపెనీని సీజ్ చేయొచ్చు, ఏకంగా లైసెన్స్ రద్దు చేయొచ్చన్నారు. అయినప్పటికీ పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందస్తు హెచ్చరికగా షోకాజ్ నోటీసులు ఇచ్చి తప్పుని సరిదిద్దుకునే అవకాశం ఇచ్చి మూడు నెలలైనా స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్ కి సమన్స్ జారీ : కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సూచనలు కనీస స్పందన పూర్తిగా కొరవడిందన్నారు. అందుకే కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణం ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్ కి సమన్స్ జారీ చేసి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్, అదనపు అడ్వకేట్ జనరల్‌తో పాటు ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిళ్లు ఇటువంటి ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల విచారణను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతాంశంగా ముందుకు తీసుకువెళ్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

మొదటి పేజి తరువాయి

నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో



ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

## రైతుల జీవితాలతో రేవంత్ రెడ్డి ఆడుకుంటున్నారు..

మొదటి పేజి తరువాయి





ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. (శుక్రవారం) కొమురం భీం జిల్లాలోని కౌటాల రైతు సదస్సులో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. సిర్పూర్ నియోజకవర్గంలో 42వేల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి పేదల ఉసురు పోసుకుంటున్నారని ఆగ్రహించారు. నాడు కేసీఆర్ భూములిస్తే... రేవంత్‌రెడ్డి ఆ భూములు లాక్కుంటున్నారని దుయ్యబట్టారు. నిషేధిత జాబితాలోని రైతన్నలకు ఎలాంటి పథకాలు వర్తించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రజలే కేంద్ర బిందువుగా కేసీఆర్ పాలన..

'ప్రజలే కేంద్ర బిందువుగా కేసీఆర్ పాలన చేశారని.. భూములే కేంద్ర బిందువుగా రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోంది. లక్షలాది ఎకరాలు, ఇల్లు, ప్లాట్లను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బంది పెడుతున్నారు. సూర్యుడు చుట్టూ భూమి తిరుగుతుంటే... భూముల చుట్టూ రేవంత్‌రెడ్డి తిరుగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పట్టాలివ్వాలే కానీ ఉన్న భూములను కబ్జా పెడుతోంది. ఈ ప్రభుత్వమే ప్రజల భూములను కబ్జా పెట్టింది. రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కూర్చొని కబ్జాదారులను అవమానిస్తున్నారు. ఒక్క ఎకరం కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అంటున్నారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి చెబితే కలెక్టర్లు నిషేధిత భూముల జాబితా పంపించారని... అప్పుడేమో పొంగులేటి సారీ అని ఈజీగా చెబుతున్నారు. ప్రజల బాధను ఆయన చూసి మాట్లాడాలి' అని హరీశ్‌రావు హితవు పలికారు.

### ప్రజల నోటి కాడి బువ్వ లాక్కోవడమేనా ఇందిరమ్మ రాజ్యం..

'15లక్షల ఎకరాల భూములను 22ఏ లో పెట్టి సారీ అని చెప్పి తప్పించుకోలేరు. ప్రజల నోటి కాడి బువ్వ లాక్కోవడమేనా ఇందిరమ్మ రాజ్యం. కలెక్టర్లు, అధికారులు, ప్రజలను ఇబ్బంది పెడితే.. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఎవరిని వదిలిపెట్టం. బేషరతుగా నిషేధిత జాబితాలోని భూములను పట్టా భూములుగా మార్చాలి. ప్రజలకు, రైతులకు న్యాయం జరిగే వరకు ఊరుకునేది లేదు. రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు కూడా టెండర్ వేయట్లేదు. రేవంత్‌రెడ్డికి 15 శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు టెండర్ వేయడం లేదు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భార్య కూడా 15శాతం కమీషన్ అడుగుతుంది. అందుకే టెండర్ వేయడానికి ఒక్కరూ కూడా ముందుకు రావట్లేదు. వెయ్యి రోజుల పాలనలో ఏ ఒక్క పని కూడా సరిగ్గా చేయలేదు' అని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గంజాయి కొట్టి విమానం నడిపిన పైలట్- ఎయిరిండియా ఫ్లైట్ ప్రమాదంపై కీలక నివేదిక

### ఫుకెట్-దిల్లీ విమాన ఘటనపై ఏఏఐబీ ప్రాథమిక నివేదిక- పైలట్-ఇన్-కమాండ్ మత్తు పదార్థం వాడినట్లు నిర్ధరణ

ఢిల్లి : ఎయిర్ ఇండియా ఫుకెట్- ఢిల్లీ విమాన ఘటనలో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. విమానాన్ని నడిపిన పైలట్లలో ఒకరు మాదకద్రవ్యాలు వాడినట్లు పరీక్షల్లో తేలింది. ఈ విషయాన్ని విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) తీవ్రంగా పరిగణించింది. విమాన సిబ్బందిలో మత్తు పదార్థాల వినియోగాన్ని అడ్డుకునేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. ఆగస్టు 4న ఫుకెట్ నుంచి దిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ 2379లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌బస్ ఏ320-251ఎన్ విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు క్యాబిన్ సిబ్బందితో కలిపి మొత్తం 145 మంది ప్రయాణిస్తున్నారు. దిల్లీకి వెళ్తున్న సమయంలో విమానం ఒక్కసారిగా 300 అడుగుల కిందకు పడిపోయింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. విమానం దిల్లీ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత గాయపడిన వారికి వైద్య సహాయం అందించారు.

### 24 మందికి వైద్య సాయం

ఏఏఐబీ విడుదల చేసిన 10 పేజీల ప్రాథమిక నివేదిక ప్రకారం, విమానం దిల్లీలో దిగిన అనంతరం మొత్తం 24 మందికి వైద్య సహాయం అందించారు. వారిలో నలుగురికి తీవ్ర గాయాలైనట్లు అధికారులు తెలిపారు. విమానంలో చోటుచేసుకున్న కుదుపులు, ప్రయాణికులకు గాయాలు కావడం వంటి అంశాలను పరిశీలించిన తర్వాత ఏఏఐబీ ఈ ఘటనను ప్రమాదంగా పరిగణించింది. ఘటనకు దారితీసిన కారణాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. దర్యాప్తులో భాగంగా విమాన సిబ్బందికి నిర్వహించిన పరీక్షల్లో పైలట్-ఇన్-కమాండ్‌కు సంబంధించిన పరీక్షలో సైకోయాక్టివ్ పదార్థం వినియోగించినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఏఏఐబీ ఆందోళన వ్యక్తం చేసింది. విమానయాన రంగంలో భద్రత అత్యంత కీలకమైన అంశమైనందున, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డీజీసీఏ తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.





### డీజీసీఏకు కీలక సిఫార్సు

మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని నిరోధించేందుకు నియంత్రణ సంస్థగా డీజీసీఏ అవసరమైన చర్యలు చేపట్టాలని ఏఏఐబీ సిఫార్సు చేసింది. పైలట్లు, ఇతర విమాన సిబ్బంది విధుల్లో ఉన్నప్పుడు మత్తు పదార్థాల ప్రభావానికి లోనుకాకుండా పర్యవేక్షణ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి తెరపైకి తెచ్చింది. అయితే పైలట్ సైకోయాక్టివ్ పదార్థం తీసుకోవడం విమానంలో చోటుచేసుకున్న 300 అడుగుల ఎత్తు తగ్గడానికి నేరుగా కారణమైందా? అనే అంశంపై తుది నిర్ణయం రావాల్సి ఉంది. దీనిపై ఏఏఐబీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

### సిబ్బందిని ప్రశ్నించిన అధికారులు

విమానానికి సంబంధించిన డేటా, రికార్డులు, ఇతర ఆధారాలను దర్యాప్తు బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఘటనపై పూర్తి వివరాలను తెలుసుకునేందుకు దిల్లీ విమానాశ్రయంలో విమాన సిబ్బంది, క్యాబిన్ సిబ్బందిని అధికారులు ప్రశ్నించారు. క్యాబిన్ సూపర్‌వైజర్‌తోనూ మాట్లాడినట్లు ఏఏఐబీ వెల్లడించింది. ఆ తర్వాత విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లను కూడా దర్యాప్తు బృందం విడిగా ఇంటర్వ్యూ చేసింది. విమానం ప్రయాణ సమయంలో ఏం జరిగింది? కుదుపులకు కారణాలేంటి? సిబ్బంది పరిస్థితి ఎలా ఉంది? వంటి అంశాలపై వివరాలు సేకరించింది.

### దర్యాప్తు కొనసాగుతోంది

ఫుకెట్ నుంచి దిల్లీకి వెళ్తున్న సమయంలో విమానం కుదుపులకు గురైనట్లు తొలుత తమకు సమాచారం అందిందని ఏఏఐబీ తెలిపింది. అనంతరం సేకరించిన ఆధారాలు, ప్రయాణికులకు అయిన గాయాలను పరిశీలించి ఘటనను ప్రమాదంగా నమోదు చేసింది. ప్రస్తుతం వివిధ వర్గాల నుంచి సేకరించిన డేటా, రికార్డులను దర్యాప్తు అధికారులు విశ్లేషిస్తున్నారు. ఘటనకు అసలు కారణం, విమాన కార్యకలాపాలపై దాని ప్రభావం, సిబ్బంది పాత్ర వంటి అంశాలపై పూర్తి స్థాయి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ప్రతి సినిమా కొత్త ప్రపంచం.. ప్రభాస్ సెలక్షన్స్ వెనుక ఉన్న లాజిక్ ఇదేనా?



పాన్ ఇండియా స్టార్‌డమ్ అనేది కేవలం భారీ ఓపెనింగ్స్ లేదా రికార్డు స్థాయి కలెక్షన్లతో మాత్రమే కొలవబడే అంశం కాదు. ఒకసారి దేశవ్యాప్తంగా మార్కెట్ ఏర్పడిన తర్వాత ప్రతి సినిమాపై ఆడియన్స్, ట్రేడ్ వర్గాలు, నిర్మాతలు పెట్టుకునే అంచనాలు సహజంగానే మరింత పెరుగుతాయి. ముఖ్యంగా వెయ్యి కోట్ల రూపా యల క్లబ్ చుట్టూ తిరిగే డిస్కషన్స్ స్టార్ హీరోల పై ఎక్స్‌ట్రా ప్రెజర్‌ను తీసుకొస్తాయి. అలాంటి పరిస్థితుల్లో చాలా మంది సేఫ్ ఫార్ములాల వైపు మొగ్గు చూపడం సాధారణమే. అయితే కొంతమంది నటులు మాత్రం బాక్సాఫీస్ లెక్కలతో పాటు తమ ఫిల్మోగ్రఫీకి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తారని సినీ వర్గాలు విశ్లేష స్తుంటాయి. ఒకే తరహా కథలు లేదా ఒకే రకమైన పాత్రలను వరుసగా చేయడం తక్షణ ఫలితాల్ని ఇచ్చినప్పటికీ, అదే విధానాన్ని పదే పదే కొనసాగిస్తే నటుడిగా వైవిధ్యం తగ్గిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. అందుకే విభిన్న జానర్లు, కొత్త పాత్రలు, భిన్నమైన కథా ప్రపంచాలను అన్వేషించే ప్రయత్నాలు లాంగ్ రన్ లో స్పెషల్ ఐడెంటిటీని తీసుకువస్తాయని ఇండస్ట్రీలో అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభాస్ కెరీర్‌ను పరిశీలించినా ఇదే కనిపిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. భారీ యాక్షన్ సినిమాల మధ్యలోనే ఫాంటసీ, హారర్, రొమాంటిక్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లు, విభిన్న స్కేల్‌లో రూపొందే కథలకు ఆయన ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నారు. ప్రతి సినిమా ఒకే టెంప్లేట్‌లో కాకుండా, ప్రేక్షకుడికి కొత్త అనుభూతిని ఇవ్వాలనే ప్రయత్నం ఆయన ప్రాజెక్టుల ఎంపికలో కనిపిస్తోందని సినీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఇలాంటి డెసిషన్స్ రిస్క్ కూడా తక్కువేమీ ఉండదు. భారీ బడ్జెట్ సినిమాల్లో ఒక్క రాంగ్ డెసిషన్ కూడా మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ సక్సెస్ ఫార్ములాను మాత్రమే నమ్ముకుండా కొత్త కథలపై ఆసక్తి చూపడం స్టార్ హీరోలకు అంత సులభమైన విషయం కాదు. అదే టైమ్ లో నటుడిగా తన పరిధిని విస్తరించుకోవాలనే ఆలోచన కూడా అలాంటి ఎంపికల వెనుక కీలక పాత్ర పోషిస్తుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.లాంగ్ రన్ కెరీర్ దృష్టితో చూస్తే తక్షణ బాక్సా ఫీస్ సక్సెస్‌ల కంటే, పదేళ్ల తర్వాత కూడా గుర్తుండిపోయే సినిమాల లిస్ట్ ను నిర్మించుకోవడమే అసలైన సవాల్‌గా భావిస్తున్నారు. ఒక నటుడి ఫిల్మోగ్రఫీ అతని మార్కెట్ విలువతో పాటు కళా త్మక ప్రయాణాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే కొత్త కథలను స్వీకరించే ధైర్యం, విభిన్న పాత్రలను అంగీకరించే మనస్తత్వం, డైరెక్టర్ల కొత్త ఆలోచనలకు అవకాశం ఇవ్వడం వంటి అంశాలే ఫ్యూచర్‌లో స్టార్ ఇమేజ్‌ను మరింత బలపరిచే కీలక కార ణాలుగా సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మూడు ఇండస్ట్రీల్లో 'ప్రేమలు' బ్యూటీ.. వరుస హిట్లు పడితే..



ఒక హిట్ పడితే అవకాశాలు వస్తాయి. కానీ ఒకే సినిమా తర్వాత మూడు ఇండస్ట్రీల్లో వరుసగా అవకాశాలు దక్కి, నెల రోజుల వ్యవధిలో మూడు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రావడం చాలా రేర్. ఇప్పుడు ఆ ప్రత్యేకతను సొంతం చేసుకున్న నటి మమితా బైజు. ప్రేమలుతో యూత్ హార్ట్ బీట్ గా మారిన ఆ మలయాళ బ్యూటీ, ఇప్పుడు తమిళం, తెలుగు, మలయాళం ఇండస్ట్రీల్లో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది. ప్రేమలు సినిమా విడుదలకు ముందు వరకు మమితా బైజు పేరు ప్రధానంగా మలయాళ ప్రేక్షకులకే తెలుసు. అయితే 2024లో విడుదలైన ఆ రొమాంటిక్ కామెడీ భారీ విజయాన్ని అందుకోవడంతో ఆమె క్రేజ్ ఫుల్ గా పెరిగిపోయింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో రీను పాత్రకు మంచి రెస్పాన్స్ వచ్చింది. సోషల్ మీడియాలో కూడా ఆమెకు ఫాలోయింగ్ భారీగా పెరిగింది. ఆ ఒక్క సినిమా మమితా కెరీర్ కు పూర్తిగా టర్నింగ్ పాయింట్ గా నిలిచింది. ఇప్పుడు మమితా వరుసగా మూడు భాషల్లో సినిమాలతో ప్రేక్షకులను అలరించనుంది. ముందుగా జూలై 23న దళపతి విజయ్ నటించిన జన నాయగన్ మూవీ విడుదల కానుంది. ఈ చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. విజయ్ లాంటి స్టార్ హీరో సినిమాతో తమిళ ప్రేక్షకుల ముందుకు రావడం మమితాకు మరింత గుర్తింపు తీసుకురానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆ తర్వాత ఆగస్టులో సూర్య హీరోగా వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్ మూవీ విడుదలకు సిద్ధమవుతోంది. ఆ చిత్రం మమితాకు స్ట్రెయిట్ తెలుగు డెబ్యూగా నిలవనుంది. ఇప్పటికే సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. సూర్య సరసన నటించే అవకాశం రావడం కూడా ఆమె కెరీర్ లో మంచి ఛాన్స్. తెలుగు ప్రేక్షకులు ప్రేమలు తర్వాత మమితాను పూర్తి స్థాయి హీరోయిన్ గా ఎలా రిసీవ్ చేసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇక ఆ రెండు సినిమాల తర్వాత కేవలం వారం రోజుల వ్యవధిలోనే మలయాళ చిత్రం బెత్లెహెం కుటుంబం విడుదల కానుంది. నివిన్ పాలీ హీరోగా తెరకెక్కుతున్న ఆ సినిమాకు ప్రేమలు దర్శకుడు గిరీష్ ఏ.డి దర్శకత్వం వహిస్తున్నారు. దీంతో మమితా మళ్లీ తన హోం ఇండస్ట్రీలో కూడా సందడి చేయనుంది. ఇలా చూస్తే, నెల రోజుల వ్యవధిలో మూడు ఇండస్ట్రీల్లో మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడం మమితా బైజుకు రేర్ ఫీట్ గా చెప్పొచ్చు. ఆ మూడు చిత్రాలు హిట్స్ అయితే ఆమె దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్ గా మరింత స్ట్రాంగ్ ప్లేస్ సంపాదించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు సహాయ పాత్రలతో కెరీర్ ప్రారంభించిన మమితా బైజు, ఇప్పుడు స్టార్ హీరోల సరసన నటిస్తూ తన జర్నీని కొత్త రేంజ్ కు తీసుకెళ్లింది. ప్రేమలు ఇచ్చిన గుర్తింపును ఆమె ఎంతలా యూజ్ చేసుకుంటుందో రానున్న కొన్ని వారాల్లోనే తేలిపోనుంది. అయితే ప్రస్తుతం మాత్రం మూడు ఇండస్ట్రీల్లో మమితా పేరు గట్టిగా వినిపిస్తుండడం విశేషం.

## అప్పుడు కాజల్.. ఇప్పుడు పూజ.. సేమ్ సీన్ రిపీట్?



కొందరు హీరోయిన్లకు స్టార్ హీరోల సినిమాలు పెద్ద అవకాశాలుగా మారితే, మరికొందరికి అదే మూవీలు నిరాశను మిగులుస్తుంటాయి. ఇప్పుడు జననాయగన్ విడుదలకు ముందే అలాంటి చర్చే సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఒకప్పుడు భగవంత్ కేసరి తెలుగు వెర్షన్ లో కాజల్ అగర్వాల్ పాత్ర విషయంలో జరిగిన చర్చ.. ఇప్పుడు పూజా హెగ్డే విషయంలోనూ వినిపిస్తోంది. దీంతో అభిమానులు అప్పుడు కాజల్.. ఇప్పుడు పూజ.. సేమ్ సీన్ రిపీట్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం జననాయగన్ గురు వారం వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా విడుదల కానుంది. రాజకీయాల్లో అడుగుపెట్టిన తర్వాత విజయ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా విజయ్ తో కలిసి పూజా హెగ్డే నటిస్తుండటంతో ఆమె పాత్రపై కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే విడుదలకు ముందే దర్శకుడు హెచ్. వినోద్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. సినిమాలో పూజా హెగ్డే జర్నలిస్టు పాత్రలో కనిపిస్తుందని, కానీ ఆమె రోల్ కు ఆశించినంత ఇంపార్టెన్స్ ఉండదని ఆయన వెల్లడించారు. మొదట కథ రాసినప్పుడు పూజా పాత్రను మరింత డెప్త్ గా ఉంచాలని అనుకున్నప్పటికీ, సినిమా రన్ టైమ్ కారణంగా కొన్ని సన్నివేశాలను తొలగించాల్సి వచ్చిందని చెప్పారు. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. విజయ్, పూజా హెగ్డే మధ్య ఎలాంటి రొమాంటిక్ ట్రాక్ ఉండదని వినోద్ స్పష్టం చేశారు. సాధారణంగా స్టార్ హీరో- హీరోయిన్ కాంబినేషన్ అంటే ప్రేక్షకులు పాటలు, రొమాన్స్, పలు కీలక సన్నివేశాలు ఆశిస్తారు. కానీ జననాయగన్ లో మాత్రం పూజా పాత్ర కథకు అవసరమైనంత వరకే పరిమితమైనట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో చాలా మందికి భగవంత్ కేసరి సినిమా గుర్తుకు వస్తోంది. ఆ మూవీలో కాజల్ అగర్వాల్ నటించినప్పటికీ, ఆమె రోల్ కు తక్కువ స్క్రీన్ స్పేస్ దక్కిందనే అభిప్రాయం అప్పట్లో వ్యక్తమైంది.

కథ మొత్తం బాలకృష్ణ, శ్రీలీల పాత్రల చుట్టూ తిరగడంతో కాజల్ పాత్ర పెద్దగా హైలైట్ కాలేదు. ఇప్పుడు పూజా హెగ్డే విషయంలో కూడా అదే తరహా పరిస్థితి కనిపిస్తోందని టాక్ వినిపిస్తోంది. నిజానికి.. ఇటీవల పూజా హెగ్డేకు ఆశించిన స్థాయిలో విజయాలు దక్కడం లేదు. దీంతో విజయ్ చివరి చిత్రంలో ఆమె నటించడం అభిమానులకు ఆనందాన్ని ఇచ్చింది. ఆ సినిమా ఆమె కెరీర్‌కు మళ్లీ మంచి ఊపు తీసుకొస్తుందని చాలామంది భావించారు. కానీ విడుదలకు ముందే దర్శకుడు కామెంట్స్ చూస్తే, పూజా స్క్రీన్ ప్రెజెన్స్ పరిమితంగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే కొన్నిసార్లు తక్కువ రన్ టైమ్ ఉన్న పాత్రలే ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతాయి. అందుకే పూజ రోల్ రన్ టైమ్ కంటే, కథలో ఆమె ఎఫెక్ట్ ఎంత అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మరి జననాయగన్ లో పూజా హెగ్డే ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో తెలుసుకోవాలంటే ఇంకొన్ని గంటలు వేచి చూడాల్సిందే.



## కోటి పైగా ఫాలోవర్లు.. కోట్లలో సంపాదన.. ఈ అందాల నటి రేంజే వేరు!

ట్యాలెంటెడ్ హ్యూమా ఖురేషి పరిచయం అవసరం లేదు. బాలీవుడ్ తో పాటు దక్షిణాదికి ఈ భామ సుపరిచితం. నటిగా ఎన్నో సంచలన చిత్రాలలో అద్భుత ప్రదన్శనలతో మెప్పించారు. వీటన్నిటినీ మించి సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్‌తో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ వ్యాల్యూను ఏర్పరచుకున్నారు. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో 10.2 మిలియన్లకు పైగా (కోటికి పైగా) ఫాలోవర్లను కలిగి ఉన్న హ్యూమా.. తన ఖాతాను కేవలం వ్యక్తిగత అప్‌డేట్ల కోసమే కాకుండా బ్రాండ్ ఎండోర్స్‌మెంట్స్, మూవీ ప్రమోషన్లు, ప్రొడక్ట్ కొలాబరేషన్లకు వేదికగా ఉపయోగిస్తున్నారు. పివిఆర్ పిక్చర్స్ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ప్రమోషనల్ రీల్స్-బ్యాక్‌రూమ్స్ వంటివి.. అలాగే ప్రముఖ పోడ్‌కాస్టలతో కాంబో పోస్టల(పీజీఎక్స్ రా అండ్ రియల్ వంటివి) తో బ్రాండ్‌లను డిజిటల్ ప్రొఫైల్‌లో ప్రమోట్ చేస్తున్నారు. సాధారణంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 10 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్న సెలబ్రిటీల డిజిటల్ ఛార్జీల ప్రామాణికత ప్రకారం... హ్యూమా ఖురేషి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్కో యాడ్-ప్రమోషనల్ పోస్ట్ లేదా రీల్ కోసం 15 లక్షల నుండి 25 లక్షల వరకు చార్జ్ చేసే అవకాశం ఉంది. బ్రాండ్ ఒప్పందాల సరళిని బట్టి నెలకు 2 నుండి 3 ప్రమోషనల్ పోస్టులు చేస్తే... ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే నెలకు 30 లక్షల నుండి 50 లక్షల వరకు ఆర్జిస్తారు. ఈ లెక్కన కేవలం ఇన్‌స్టాగ్రామ్ బ్రాండ్ కొలాబరేషన్ల ద్వారానే ఏడాదికి 4 కోట్ల నుండి 6 కోట్ల వరకు ఆదాయం పొందుతున్నారని అంచనా. ట్విట్టర్ వేదిక విషయానికి వస్తే..అక్కడ ఉన్న ఫాలోయింగ్ - రీచ్ ఆధారంగా ఒక ప్రమోషనల్ పోస్ట్‌కు లేదా ట్వీట్‌కు హ్యూమా ఖురేషి 3 లక్షల నుండి 5 లక్షల వరకు తీసుకుంటారని అంచనా. ఎక్స్ ద్వారా నెలకు సుమారు 8 లక్షల నుండి 15 లక్షల వరకు..అలాగే ఏడాదికి దాదాపు 1 కోటి నుండి 1.5 కోట్ల వరకు.. డిజిటల్ ప్రమోషన్ల ద్వారా ఆర్జించే అవకాశం ఉంది. హ్యూమా ఖురేషి సినీ పారితోషికం విషయానికి వస్తే.. తను లీడ్ పాత్రలో నటించే బాలీవుడ్ చిత్రాలకు అలాగే భారీ ఓటీటీ ప్రాజెక్ట్‌లకు (ఉదాహరణకు 'మహారాణి' సిరీస్) ఒక్కో ప్రాజెక్ట్‌కు 2 కోట్ల నుండి 3 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటున్నారు. ఇక 2026లో హ్యూమా నటించిన, నటిస్తున్న సినిమాల జాబితా చాలా బిజీగా ఉంది. జూలై 3న విడుదలైన యాక్షన్ థ్రిల్లర్ 'బేబీ డో డై డో' థియేటర్లలో ఆకట్టుకుంది. తదుపరి యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ పాన్-ఇండియా చిత్రం -టాక్సిక్- లో హ్యూమా ఒక కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇవే కాకుండా 'గులాబి', 'బయాన్', 'పూజా మేరీ జాన్' చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అలాగే -మహారాణి- తదుపరి సీజన్‌లతో పాటు 'ఢిల్లీ క్రైమ్ 3' షూటింగ్ పనుల్లోను ఈ బ్యూటీ బిజీగా ఉన్నారు. ఇక దక్షిణాది సినిమాల విషయానికి వస్తే.. హ్యూమా ఖురేషి నేరుగా తెలుగులో పూర్తి స్థాయి కథానాయికగా ఏ స్ట్రెయిట్ తెలుగు చిత్రంలోనూ నటించలేదు. అయితే తమిళంలో రజినీకాంత్ సరసన నటించిన 'కాలా', అజిత్ 'వాలిమై' చిత్రాలలో నటించింది. త్వరలో విడుదలకు వస్తున్న 'టాక్సిక్' చిత్రంపై భారీ హోప్స్ పెట్టుకుంది. ఈ మూవీ కోసం 2 కోట్ల నుండి 3 కోట్ల వరకు పారితోషికం అందుకున్నట్లు ట్రేడ్ వర్గాల సమాచారం.

## 'లెనిన్' ప్రమోషన్స్‌లో గ్లామర్ షో... భాగ్యశ్రీ హైలైట్!



టాలీవుడ్ క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే ట్రెడిషనల్ లుక్‌లో మెరిసిపోతూ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అఖిల్ అక్కినేని హీరోగా నటించిన 'లెనిన్' రేపు (జూలై 10న) థియేటర్లలోకి వస్తున్న సందర్భంగా ఈ భామ అదిరిపోయే ఫోటోషూట్ షేర్ చేసింది. రాయల్ బ్లూ, పాస్టెల్ లైమ్-గ్రీన్ లెహంగా కాంబినేషన్‌లో వింటేజ్ సౌత్ ఇండియన్ లుక్‌తో మైండ్ బ్లాక్ చేస్తోంది. ఈ సినిమాలో తాను పోషించిన 'భారతి' క్యారెక్టర్ అందరి హృదయాల్లో నిలిచిపోతుందని చెప్తూ ప్రమోషన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఆ విశేషాలు చూద్దాం..

కనువిందు చేస్తున్న వింటేజ్ లుక్: ప్రముఖ డిజైనర్ భార్గవి కునమ్ డిజైన్ చేసిన ట్రెడిషనల్ లెహంగాలో భాగ్యశ్రీ బోర్సే లంగావోణి రాయల్ లుక్‌ను గుర్తు చేస్తోంది. లైమ్-గ్రీన్ కలర్ లంగా, దానికి మ్యాచ్ అవుతూ జరి ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న రాయల్ బ్లూ బ్లౌజ్ ధరించింది. చేతులకు వేసుకున్న బ్లూ అండ్ గోల్డ్ గాజులు, పెటల్స్ బై స్వాతి జ్యువెలరీ ఆమెకు పక్కా పల్లెటూరి అందాన్ని తెచ్చిపెట్టాయి. ఈ ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.

అఖిల్ 'లెనిన్' పైనే భారీ ఆశలు: రేపు విడుదల కాబోతున్న 'లెనిన్' సినిమాపై అక్కినేని ఫ్యాన్స్ భారీ ఆశలు పెట్టుకున్నారు. అఖిల్ అక్కినేని కెరీర్‌కు ఈ సినిమా సక్సెస్ ఎంత ముఖ్యమో, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకి కూడా అంతే ముఖ్యం. ఇక కింగ్ నాగార్జున, నిర్మాత సూర్యదేవర నాగవంశీతో పాటు చిత్ర యూనిట్ అంతా సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని ఎంతో ధీమాగా ఉన్నారు.

భాగ్యశ్రీ కు వెంటనే ఒక హిట్ అవసరం: టాలీవుడ్ లోకి వచ్చినప్పటి నుంచి ఆమె పెద్ద ప్రాజెక్టులే చేస్తోంది. రవితేజతో 'మిస్టర్ బచ్చన్', విజయ్ దేవరకొండతో 'కింగ్‌డమ్', రామ్ పోతినేని సరసన 'ఆంధ్రా కింగ్ తాలూకా' వంటి క్రేజీ సినిమాలు చేసింది. అలాగే తమిళం నుంచి డబ్ అయిన 'కాంత' సినిమాలోనూ ఆమే మెయిన్ లీడ్. అయితే దురదృష్టవశాత్తు ఇప్పటివరకు సరైన కమర్షియల్ సక్సెస్ పడలేదు. అందుకే ఈ 'లెనిన్' మూవీపై ఆమె ఎన్నో ఆశలు పెట్టుకుంది.

చేతిలో ఉన్న క్రేజీ ప్రాజెక్టులు: హిట్స్ లేకపోయినా భాగ్యశ్రీ క్రేజ్‌కు, అవకాశాలకు వచ్చిన ఢోకా ఏమీ లేదు. ప్రస్తుతం తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ సరసన 'సియోన్' అనే ప్రతిష్టాత్మక చిత్రంలో నటిస్తోంది.

ఇది కాకుండా టాలీవుడ్‌లో మరికొందరు స్టార్ హీరోల సినిమాలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. అయితే ఇండస్ట్రీలో మరింత నిలదొక్కుకోవడానికి, రెమ్యూనరేషన్ పెరగడానికి ఈమెకు ఒక సాలిడ్ హిట్ చాలా అవసరం. స్టైల్, గ్లామర్, యాక్టింగ్ పరంగా భాగ్యశ్రీ బోర్సే ఎప్పుడూ బెస్ట్ ఇస్తూనే ఉంటుంది. 'లెనిన్' సినిమాలో 'భారతి'గా ఆమె పాత్ర ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి. మరి రేపు రాబో తున్న ఈ సినిమా భాగ్యశ్రీ బోర్సే కెరీర్‌ను మలుపు తిప్పి, టాలీవుడ్‌లో లక్కీ హీరో యిన్‌గా మారుస్తుందో లేదో తెలియా లంటే కొన్ని గంటలు ఆగాల్సిందే.





## విదేశీ వీధుల్లో మినీ ఫ్రాక్ తో సందడి చేస్తున్న రీతూ వర్మ!



షార్ట్ ఫిలిమ్స్ ద్వారా తన కెరీర్ ను మొదలు పెట్టి, ఆ తర్వాత పెళ్లిచూపులు సినిమాతో హీరోయిన్గా వెండితెరకు పరిచయ మైన రీతు వర్మ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో అందరి దృష్టిని ఆకట్టుకునే ఈమె.. తన చిరు నవ్వుతోనే అభిమానుల హృదయాలను దోచుకుంటుం దనటంలో సందేహం లేదు. నిత్యం ప్రేక్షకులను అలరించే ఈమె.. తాజాగా మరో లేటెస్ట్ ఫోటోషూట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విదేశీ వీధుల్లో సందడి చేస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మిస్ సెల్ఫ్రిడ్జ్ మ్యాక్సీ డ్రెస్ ధరించిన ఈమె విదేశీ వీధుల్లో చక్కర్లు కొడుతూ అక్కడి విదేశీయులను ఆకర్షించే ప్రయత్నం చేసింది. ఇక మరికొన్ని ఫోటోలలో షార్ట్ ఫ్రాక్ ధరించి మంత్రముగ్ధుల్ని చేసింది. అంతేకాదు అక్కడి ప్రదేశాలను ఫోటోల రూపంలో అభిమానులతో పంచుకుంది. ఈ ఫోటోలకి క్యాప్షన్ గా..” కొన్ని ప్రదేశాలను మనం విడిచి వెళ్లినప్పటికీ అవి ఇంకా మనతోనే ఉన్నాయి అనే భావన కలుగుతుంది” అంటూ చెప్పుకొచ్చింది. మొత్తానికి విదేశీ వీధిలో చక్కర్లు కొడుతున్న ఈమె.. తన చిట్టి పొట్టి బట్టలతో అక్కడివారిని ఆకట్టుకోవడమే కాకుండా ఆ ప్రాంతాలను ఫాలోవర్స్ కి చూపిస్తూ మరింత వైరల్ అయింది. ఇదిలా ఉండగా.. మరొకవైపు మెగా మేనల్లుడు పంజా వైష్ణవ్ తేజ్ తో రహస్యంగా రిలేషన్ లో ఉంది అంటూ వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా లావణ్య - వరుణ్ తేజ్ పెళ్లిలో సందడి చేసిన ఈమె.. అప్పటి నుంచే వైష్ణవ్ తేజ్ తో పరిచయం స్నేహంగా మారి ప్రేమకు దారి తీసింది అని వార్తలు వినిపించాయి. అయితే ఆ మధ్యకాలంలో వైష్ణవ్ తేజ్ స్పందిస్తూ.. రీతు వర్మ తనకు కేవలం స్నేహితురాలు మాత్రమే అని చెప్పి రూమర్స్ కి చెక్ పెట్టారు. ఆ తర్వాత లో ప్రొఫైల్ మెయింటైన్ చేశారు రీతూ వర్మ - వైష్ణవ్ తేజ్. దీనికి తోడు అప్పుడప్పుడు రీతూ వర్మ సినిమాలు ప్రకటిస్తోంది. కానీ 2023 తర్వాత వైష్ణవ్ తేజ్ ఒక్క ప్రాజెక్టు కూడా ప్రకటించలేదు. ఇకపోతే గత కొంతకాలంగా వైష్ణవ్ తేజ్ రీతు వర్మలు కనిపించకపోయేసరికి వీరిద్దరి మధ్య బ్రేకప్ అంటూ మరికొన్ని వార్తలు పుట్టు కొచ్చాయి. ఇక ఇలా వార్తలు వస్తున్న సమయంలో సడన్గా రీతు వర్మ ఒక కొత్త పోస్ట్ పెట్టి..”కొత్త ప్రయాణానికి ప్రారంభం” అంటూ క్యాప్షన్ జోడించడం.. దానికి వైష్ణవ్ తేజ్ లైక్ కొట్టడంతో ఇక నిజంగానే వీరిద్దరూ రిలేషన్ లో ఉన్నారు కానీ తమ బంధాన్ని రహస్యంగా మైంటైన్ చేస్తున్నారు కచ్చితంగా ఏదో ఒక రోజు రివిల్ చేస్తారు అంటూ నెటిజెన్లు కామెంట్లు చేస్తున్నారు.ఇకపోతే ప్రస్తుతం వైష్ణవ్ తేజ్ బలమైన కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి కథలు వింటున్నారని వార్తలు రాగా.. ఇటు రీతు వర్మ గోపీచంద్ హీరోగా నటిస్తున్న భరతవర్ష అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో ఒక గిరిజన యోధురాలి పాత్రలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815